క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



రూ.50 వేలు విరాళం అందిస్తున్న గుమ్మనూరు నారాయణస్వామి

ఆలూరు: దేవనకొండ మండలం వెలమకూరు గ్రామ సమీపంలోని మజరా గ్రామమైనా సింగాపురంలో కొలువుదీరిన శ్రీ బండ తిమ్మప్ప ఆలయం నిర్మాణానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తరపున ఆయన సోదరుడు నారాయణస్వామి రూ.50 వేలు విరాళం అందించారు. శుక్రవారం మంత్రి నివాసంలో ఆలయ కమిటీ చైర్మెన్ గొల్ల ఆదెన్న, సభ్యులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు యాదవ సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



పనులు పరిశీలిస్తున్న డీఈఈ శేషయ్య

మద్దికెర: గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణంలో ప్రభుత్వం సూచించిన నిబంధనలు మేరకు నాణ్యత ప్రామాణాలు తప్పనిసరిగా పాటించాలని పంచాయతీరాజ్ డీఈఈ శేషయ్య ఆదేశించారు. శుక్రవారం మద్దికెరలో రూ.80 లక్షలతో సాయినగర్, చాకలివీధి, శీనప్ప బావి వద్ద జరుగుతున్న సీసీ రోడ్ల పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. అలాగే రోడ్డు పనులు పూర్తయిన తరువాత నిర్ణీత సమయం వరకు క్యూరింగ్ చేయాలన్నారు. జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు ఉన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి



పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ అక్బర్‌బాషా

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ అక్బర్‌బాషా సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని బింగిదొడ్డి, గోవర్ధనగిరి, శ్రీరంగాపురం గ్రామాల పరిధిలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయా గ్రామాల ఆర్బీకేలు, అందులోని రికార్డులను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. రైతులు సమీప ఆర్బీకేలను సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలన్నారు. తద్వారా ప్రభుత్వం అందించే పథకాల అర్హులవుతారన్నారు. ఆర్బీకేల సిబ్బంది వెంట ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



లభ్యమైన మృతదేహం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని కలుగొట్ల రోడ్డు న్యూ ఎస్సీ కాలనీ సమీపంలోని ముగురు కాలువలో శుక్రవారం గుర్తు తెలియని మృత దేహం లభ్యమైంది. కాలువలో మృతదేహం పడిఉండడాన్ని అటుగా వెళ్లిన వారు గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలుసుకునేందుకు విచారణ చేపట్టారు.

క్రీడా దుస్తుల పంపిణీ

పత్తికొండ రూరల్: పత్తికొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడా మైదానంలో క్రికెట్, షటిల్ ఆడుతున్న 16 మంది సచివాలయం –4 పరిధిలోని క్రీడాకారులకు శ్రీరామ హాస్పిటల్ అధినేత కునిగిరి నీలకంఠ క్రీడాదుస్తులు అందజేశారు. యువత క్రీడల్లో రాణించి ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పీర్ల చావిడి ప్రారంభం

మద్దికెర: మండల పరిధిలోని హంప గ్రామంలో నూతనంగా నిర్మించిన హజరత్ హుస్సేన్ స్వామి పీర్ల చావిడిని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. గ్రామ ప్రజల ఆరాధ్య దైవం హుస్సేన్‌స్వామికి పూజలు నిర్వహించారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా ఉరుసు

చిప్పగిరి: మండలంలోని ఏరూరు గ్రామంలో షేక్ ఖాజా ఉసేన్ స్వామి 53వ ఉరుసును శుక్రవారం గ్రామ పెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ప్రతిమను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి వారికి చక్కెర చదివింపులు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ వెంకటలక్ష్మి, సేనాపతి, రాజన్న, బాలకృష్ణ, జయరాముడు తదిరరులు పాల్గొన్నారు.

నెరవేరిన కల



- రూ.2.25 కోట్లతో తారు రోడ్డు
- రోడ్డు నిర్మించడంతో గ్రామస్తుల హర్షం
- హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



నేడు - బొజ్జనాయునిపేటకు నిర్మించిన రోడ్డు



నాడు - కంకర తేలిన రోడ్డు

మద్దికెర: మండల కేంద్రానికి 3 కి.మీ దూరంలో విసిరేసినట్టుగా ఉండే గ్రామం. అడుగు వేయాలంటే సాధ్యం కాని రాళ్లు తేలిన రోడ్డు. మండల కేంద్రానికి రావాలంటే అగచాట్లు తప్పలేదు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు అయినా పట్టించుకున్న నాథుడు లేడు. అయితే ఇబ్బందులు పడుతున్న మజరా గ్రామమైన బొజ్జనాయుని పేట గ్రామస్తులకు ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ ప్రకారం రోడ్డు నిర్మించి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గ్రామస్తుల కల నెరవేర్చారు. మండలంలోని బొజ్జనాయునిపేట గ్రామం మద్దికెరలోని ఒక వార్డులో ఒక భాగం. గ్రామంలో 70 ఇళ్లు, 300 ఓట్లు, 550 మంది జనాభా ఉన్నారు. టీడీపీ పుట్టినప్పటి నుంచి ఆ పార్టీ సానుభూతి గ్రామంగా ముద్ర వేసుకుంది. ఎన్నికలు వచ్చినపుడు గ్రామంలో పర్యటనకు వచ్చే నాయకులను రోడ్డు కావాలని అడిగిన ప్రతిసారి వేస్తామని చెప్పి గెలిచిన తర్వాత ముఖం చాటేసేవారు. కేఈ కృష్ణమూర్తి ఎమ్మెల్యేగా గెలిచి ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత గ్రామానికి రోడ్డు వస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తామని ప్రజలు అండగా నిలవాలని కోరుతూ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మీ గ్రామానికి రోడ్డు వేయించిన తర్వాతే మళ్లీ గ్రామంలో అడుగుపెడతానని హామీ ఇచ్చి నెరవేర్చిన తర్వాతే గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. రోడ్డు సౌకర్యం కల్పించడంతో గ్రామస్తులు, విద్యార్థులు, రైతులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే కృషితోనే రోడ్డు



ఎన్నో ఏళ్లుగా రోడ్డు లేక గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులు మాకు బాగా తెలుసు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విజయం సాధించిన వెంటనే మొట్టమొదటగా బొజ్జనాయునిపేటకు రోడ్డు వేయించాలని పట్టుబట్టి నిధులు మంజూరు చేయించుకొని రోడ్డు వేయించాం. మాకు పార్టీలు ముఖ్యం కాదు. ప్రజలు ముఖ్యం. రోడ్డు నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశాం.

– మురళీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ, మద్దికెర.

ఇన్నేళ్లకు రోడ్డు వేశారు



నేను ఎస్‌బీసీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాను. ఎప్పుడంటే అప్పుడు గ్రామానికి రావాల్సి ఉంటుంది. గతంలో రోడ్డు లేక రాళ్లు తేలి ద్విచక్రవాహనం నడపాలంటే ఇబ్బందులు పడేవాళ్లం. నాయకులు వచ్చిన ప్రతిసారి రోడ్డు కావాలని అడగడం వాళ్లు హామీ ఇచ్చి మరిచిపోవడం పరిపాటి అయింది. అయితే ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఇచ్చిన మాటకు కట్టుబడి రోడ్డు నిర్మించి మా కల నెరవేర్చారు.

– మంజునాథ్ రెడ్డి, బొజ్జనాయునిపేట, మద్దికెర

ఇబ్బందులు తొలగాయి



నేను పని నిమిత్తం ప్రతిరోజు మండల కేంద్రానికి రావాల్సి ఉంటుంది. బయలుదేరినపుడు రోడ్డును చూసి భయపడేవాడిని. రోడ్డు నిర్మించిన తరువాత చాలా సంతోషంగా ఉంది. రాకపోకలకు సౌకర్యంగా మారింది. – ఆచారి, బొజ్జనాయునిపేట

పాడి పశువులకు ఇన్సూరెన్స్

హాలహర్వి: పాడి రైతులు తమ పశువులకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించాలని స్థానిక పశువైద్యాధికారి అశోక్‌కుమార్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక పశు వైద్యశాలలో పాడిరైతులతో మాట్లాడారు. ప్రభుత్వం అతి తక్కువ ధరకే గొర్రెలు, మేకలకు, వృషభాలు, ఆవులు తదితర వాటికి ఇన్సూరెన్స్ చేయించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. జీవాలకు ప్రమాద వశాత్తు ఏదైనా జరిగితే ప్రభుత్వం ఇన్సూరెన్స్ అందిస్తుందన్నారు. వివరాలకు స్థానిక పశువైద్యశాలను సంప్రదించాలన్నారు.

నిర్వాసితుల వివరాల సేకరణ

పత్తికొండ రూరల్: పత్తికొండలో రోడ్డు విస్తరణ నేపథ్యంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా భవనాలు, స్థలాలు కలిగిన 281 మంది నుంచి శుక్రవారం అధికారులు వివరాలు నమోదు చేసుకున్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద 5 కౌంటర్లు ఏర్పాటుచేసి రోడ్డు విస్తరణలో భాగంగా స్థలాలు కోల్పోయే వారికి తగిన పరిహారం అందించేందుకు భూయజమాని డాక్యుమెంట్‌లు, ఆధార్, వ్యక్తిగత బ్యాంకు ఖాతా తదితర వివరాలు, ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను తీసుకున్నారు. రోడ్డు విస్తరణ చేపడితే తమకు నష్టం కలుగుతుందని కొందరు కోర్టును ఆశ్రయించగా.. వివరాల సేకరణలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆర్డీఓ నీలపు రామలక్ష్మి ఆదేశాల మేరకు ఎస్‌ఐ గోపాల్ పోలీసు బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గురజాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెక్టోరల్ అధికారి

నందవరం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సెక్టోరల్ అధికారులు పోలింగ్ కేంద్రాల పరిశీలన ముమ్మరం చేశారు. శుక్రవారం మండల పరిధిలోని నాగలదిన్నె, గురజాల, రాయచోటి, మిట్టసోమపురం గ్రామాలలోని పోలింగ్ బూత్‌లు 9, 10, 14, 15, 17 లను ఎన్నికల సెక్టోరల్ అధికారి, మండల ఏఓ మర్రి స్రవంతి తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల స్థితిగతులు, మౌలిక సదుపాయాలను పరిశీలించామన్నారు. పోలింగ్ స్టేషన్‌లో విద్యుత్, తాగు నీటి సౌకర్యం, ర్యాంపులు, టాయిలెట్లు వంటి వసతులను పరీక్షించామన్నారు. మౌలిక వసతులు లేని కేంద్రాలకు అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. ఏఎస్‌ఐ చంద్రశేఖర్, ఆయా గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

మద్దికెర: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిన్నారుల ఉత్తమ భవిష్యత్తు కోసం విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చేట్టారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలనే ఉద్దేశంతో అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. నాడు – నేడు ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించడం జరిగిందన్నారు. పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయులు దేవేంద్రప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణ, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం

- లో ఓల్టేజ్ సమస్యలకు చెక్
- చిట్యాలలో రూ.3.5 కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీదేవి



చిట్యాలలో విద్యుత్ సబ్‌స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి: విద్యుత్ సమస్యలు పరిష్కరించి, వ్యవసాయానికి, గృహ అవసరాలను నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో రూ.3.5 కోట్లతో ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ఆమె జిల్లా విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఉమాపతి, ఈఈ ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ కేఈ సుభాషిణితో కలిసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ చిట్యాలతోపాటు కోయిలకొండ, పెద్దొడ్డి, చుంచుఎర్రగుడి తదితర గ్రామాల రైతులు పడుతున్న కష్టాలను చూసి ఈ గ్రామాలకు సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. రూ.3.5 కోట్లతో గ్రామంలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ఈ ఏడాది మార్చిలో పనులు ప్రారంభించి ఎనిమిది నెలల్లోనే పూర్తి చేసి, ఇక్కడి రైతుల కలను నేరవేర్చినందుకు సంతోషంగా ఉందన్నారు. జిల్లా విద్యుత్ శాఖ (ఆపరేషన్) ఎస్‌ఈ మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ యేడాది నూతనంగా 9 విద్యుత్ సబ్‌స్టేషన్లను రూ.30 కోట్లతో ఏర్పాటు చేసేందుకు పనులు చేపట్టగా మొట్టమొదట ఈ గ్రామంలో పూర్తి చేశామన్నారు. ఈ సబ్‌స్టేషన్ కింద ఆరు గ్రామాలకు గృహ వినియోగంతోపాటు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. ప్రస్తుతం 5 మెగావాట్ల విద్యుత్ సరఫరా అవుతుందని మరో నెలన్నరకల్లా మరో 5 మెగావాట్ల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తాన్నామన్నారు. గతేడాది జిల్లావ్యాప్తంగా వ్యవసాయానికి 18 వేల కనెక్షన్ల కోసం దరఖాస్తులు రాగా కృష్ణగిరి మండలానికి వెయ్యి కనెక్షన్లు ఇచ్చామన్నారు. గత నాలుగేళ్లలో 3 వేలకు పైగా కనెక్షన్లు ఇచ్చామని ఇంకా 496 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయని వీటిని జనవరి చివరికల్లా పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎస్‌ఈని రైతులు శాలువాలు, పూలమాలలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ట్రాన్స్‌కో ఏడీఏ రమణారావు, ఏఈ మద్దిలేటి, సొసైటీ చైర్మన్లు సుధాకర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

ప్రాణం విలువ తెలిసిన ప్రభుత్వం కావడంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య శ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారని ఎమ్మెల్యే కంగాటి అన్నారు. మండల పరిధిలోని ఆలంకొండ గ్రామంలో శుక్రవారం ఆమె లబ్ధిదారులకు ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. వైద్యం కోసం పేద ప్రజలు అప్పుల పాలు కాకూడదనే లక్ష్యంతోనే ఆరోగ్య శ్రీ పథకాన్ని విస్తరించారన్నారు. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ కేఈ సుభాషిణి, పార్టీ మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు, వైద్యాధికారి ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.



ఆస్పరిలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



మద్దికెరలో కబడ్డీలో తలపడుతున్న జట్లు



ఆలంకొండలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

అంబరాన్నంటిన క్రీడోత్సాహం



వెల్దుర్తిలో సరదాగా బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



గంజహళ్లిలో వాలీబాల్ ఆడుతున్న యువతులు

వెల్దుర్తి(కృష్ణగిరి): సచివాలయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహిస్తున్న 'ఆడుదాం–ఆంధ్రా' పోటీల్లో సత్తాచాటుతూ క్రీడాకారులు అంచెలంచెలుగా ఎదగాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సూచించారు. శుక్రవారం ఆమె వైఎస్సార్‌సీపీ వెల్దుర్తి మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, కృష్ణగిరి ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డితో కలిసి స్థానిక బాలుర హైస్కూల్ మైదానంలో క్రీడా పోటీలను ప్రారంభించారు. సచివాలయం-1 పరిధిలోని పురుషుల క్రికెట్, మహిళల షటిల్ బ్యాడ్మింటన్ (డబుల్స్) పోటీలను టాస్ వేసి ప్రారంభించారు. క్రీడాకారుల పరిచయం అనంతరం వారికి ఆల్ ది బెస్ట్ చెబుతూ సరదాగా కాసేపు బ్యాటింగ్ చేశారు. అలాగే షటిల్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. క్రీడాకారుల కొరకు ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. అధికారులు క్రీడాపోటీల నిర్వహనకు చేస్తున్న ఏర్పాట్లు, విద్యాశాఖ పీడీలు, పీఈటీలు, సచివాలయ సిబ్బంది చేస్తున్న కృషిని అభినందించారు. జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ, ఎంపీడీఓ శ్రీనివాసరావ్, బ్రహ్మగుండం చైర్మన్ పెద్దిరెడ్డి, అగస్టీన్, పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలో శుక్రవారం వాలీబాల్ పోటీలను ఎంఈఓ రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. క్రీడాకారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే మండలంలోని శంకరబండ, జొహరాపురం, చిన్నహోతూరు, బిల్లేకల్లు, ముత్తుకూరు, కైరుప్పల, కారుమంచి, ములుగుందం, బనవనూరు, డీకోటకొండ, చిగిళి, బిణిగేరి, నగరూరు, తంగరడోణ, యాటకల్లు, హలిగేర గ్రామాలలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలోని గోనెగండ్ల, పెద్దనేలటూర్, గంజిహళ్లి తదితర గ్రామాల్లో క్రికెట్, ఖోఖో, బాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. గోనెగండ్లలో పోటీలను ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ రామాంజినేయులు పర్యవేక్షించారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలో ఎంపీపీ కేశన్న పోటీలను ప్రారంభించారు. అలాగే గుడేకల్‌లో తహసీల్దార్ ఆంజనేయులు వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. ఎంపీడీఓ బంగారమ్మ, ఇతర అధికారులు పర్యవేక్షించారు.

మద్దికెర: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న క్రీడలను ఎంపీడీఓ నరసింహమూర్తి పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలను యువత సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, వ్యాయామ ఉపాధ్యాయులు సంజప్ప, రంగ తదితరులు ఉన్నారు.

తుగ్గలి: మండలంలోని తుగ్గలి, జొన్నగిరి, పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీహెచ్ఎస్ మైదానాల్లో ఆయా సచివాలయ పరిధిలోని 14 జట్ల క్రీడాకారులు వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను తహసీల్దార్ రవి, ఎంపీడీఓ సావిత్రి, ఈవోపీఆర్డీ తిరుపాల్ పర్యవేక్షించారు. ఫిజికల్ డైరెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: మండలంలోని పలు క్రీడా మైదానాల్లో ఆడుదాం – ఆంధ్రా క్రీడలు ఉత్సాహంగా సాగాయి. కోయిలకొండలో కబడ్డీ పోటీలను హెచ్ఎం మైఖెల్, ఆలంకొండలో క్రికెట్ పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్‌కుమార్ ప్రారంభించారు. పోటీలను ఎంపీడీఓ రామస్వామి పర్యవేక్షించారు. పీడీలు, పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నందవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో వాలీబాల్ పోటీలను ఎంపీడీఓ దశరథ రామయ్య ప్రారంభించారు. క్రీడాకారులు స్ఫూర్తితో రాణించాలన్నారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, ఫిజికల్ డైరెక్టర్ ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు: మండలంలోని కురువెళ్లి, హత్తిబెళగల్ గ్రామాల జట్ల క్రికెట్ పోటీలను సర్పంచ్ ఉప్పర రవితేజ ప్రారంభించారు. పీడీ కవిరాజు, పీఈటీ చిన్నబాబు పోటీలను పర్యవేక్షించారు.

హొళగుంద: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల పాఠశాల మైదానాలలో శుక్రవారం బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంపీడీఓ సుభాషిణి, ఈఓపీఆర్డీ చంద్రమౌళీశ్వరగౌడ్, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్, షఫి, రంగస్వామి తదితరులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తూ ఆరోగ్యాన్ని కాపాడుతాయని చెప్పారు.



గుడేకల్‌లో బాలికల వాలీబాల్ పోటీ



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ రవితేజ



నందవరంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

వైభవంగా గోపుర కలశ ప్రతిష్ఠాపన

హొళగుంద: మండల కేంద్రం హొళగుంద శివారు కడ్లమాగి రస్తాలోని పెద్ద చెరువు గట్టుపై వెలసిన గాయత్రి దేవి ఆలయ గోపుర కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. చెరువు గట్టుపై అమ్మవారి ఆలయం చిన్నగా ఉండి శిథిలావస్థకు చేరింది. దీంతో గ్రామపెద్దలు నూతన ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపనకు పూనుకున్నారు. అందులో భాగంగా శుక్రవారం కలశ ప్రతిష్ఠాపన చేపట్టారు. ఈ సందర్భంగా గంగిపూజ, గోపూజ, సహస్రనామ హోమాలు ఇతర ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం గోపుర కలశ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట పూజలు నిర్వహించారు. అలాగే అన్నదాన కార్యక్రమం జరిగింది.

22న ఓటరు తుది జాబితా

ఆలూరు రూరల్: రానున్న జనవరి 22వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురణ ఉంటుందని ఆలూరు అసెంబ్లీ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడారు. ఇప్పటివరకు అందిన దరఖాస్తులు, అభ్యంతరాలను బీఎల్‌ఓల ద్వారా పరిష్కరించామన్నారు. ఇంకా ఓటరు నమోదులో అభ్యంతరాలుంటే వచ్చే నెల 12వ తేదీ వరకు స్వీకరించి పరిష్కరిస్తామని చెప్పారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ప్రస్తుతం నియోజవర్గంలోని 294 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,49,524 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు.

దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 11వ వార్డులో అనుమతి లేకుండా కొళాయి ఏర్పాటు చేసుకున్న ఇంటి యజమానిని ప్రశ్నించగా ఆయన కుమారుడు నవాజ్ వార్డు సచివాలయ అమెనిటీస్ సెక్రటరీ రాజుపై దాడి చేశాడని, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీగా వెళ్లి సోమప్ప సర్కిల్ వద్ద ధర్నా చేశారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి

గోనెగండ్ల: నూతన సంవత్సరంలో నూతన ఉత్తేజంతో పనిచేస్తూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు సూచించారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద యూటీఎఫ్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠ చేతుల మీదుగా ఆవిష్కరించారు. యూటీఎఫ్ నాయకులు నీలకంఠ, కేశవులు, సలోమి తదితరులు పాల్గొన్నారు.